


# ప్రేమికుడు 2020

- నమ్మి కనక నాగేశ్వరరావు

పీస్‌ఫుల్‌గా ఎప్పుడూ నిద్రపోయే తనీష్ తన జీవితంలో మొదటిసారిగా నిద్ర మధ్యలో వచ్చిన పీడకలకి బెదిరిపోయి, పిచ్చి కేకలు వేస్తూ లేచాడు.

ఇదతనికి జీవితంలో తొలి అనుభవం!

వళ్ళంతా చెమటలు పట్టినట్టయ్యింది. గొంతు పిడచ గట్టుకుపోయింది. బెడ్ మీంచి లేచి ఫ్రిజ్‌లోంచి వాటర్ బాటిల్ తీసుకొని సగం బాటిల్ గటగటా త్రాగుతూ ఖాళీ చేసేశాడు.

రెండు తక్కువ పాతికేళ్ళ కుర్రాడుగా రీసెర్చ్ సెంటర్లో ఐదంకెల జీతంతో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన తనీష్‌కి ఇది ఆ జాబ్‌లో రెండో సంవత్సరం.

ఇప్పుడు తనీష్ వయస్సు పాతికేళ్ళు!

నూనూగు మీసాల నూత్నయవ్వన స్థాయినిదాటి చాలా ఏళ్ళయ్యింది.

పదహారేళ్ళు తెలీకుండా, రెండేళ్ళు తెలిసీతెలియకుండా, మూడేళ్ళు అంతా తెలిసినట్టున్నా ఇంకా తెలీనట్టుగా, తర్వాత రెండేళ్ళు ఇంకా ఎంతో తెలుసుకోవాలనుకున్నట్టుగా మొత్తం ఇరవై మూడేళ్ళు...

చదువు... చదువు... చదువు...

పదహారేళ్ళకు టెన్త్, తర్వాత రెండేళ్ళు ఇంటర్, ఆపై మూడేళ్ళు డిగ్రీ, ఆనక రెండేళ్ళు పీ.జీ.

చదువు... చదువు... చదువు...

పీజీ కంప్లీట్‌కాగానే కాంపస్‌లోనే ఉద్యోగానికి సెలక్టయి ఇప్పుడు పగలూ, రాత్రీ ఉద్యోగం... ఉద్యోగం... ఉద్యోగం...

పనివేళలతో సంబంధం లేకుండా ఎక్కువ సమయం ఆఫీసులోనే గడపడానికి తనీష్ దగ్గరో కారణముంది.

అతనో బ్యాచిలర్!

బాధ్యతలు లేని చేతినిండా సంపాదనున్న బ్యాచిలర్!

ఏసీ అంటూ లేదు గానీ హైద్రాబాద్‌లోని మాంచి ఫోష్ ఏరియాలో సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో సింగిల్‌గా ఉంటున్నాడు.

స్కూలు, కాలేజి, యూనివర్శిటీ స్థాయిల్లో తనీష్‌కి మంచి ట్రాక్ రికార్డు ఉంది.

తన క్లాసులో గానీ, తనుండే పరిసరాల్లోగానీ ఆడపిల్లలున్నా వారి ఉనికి గురించి అతనికెప్పుడూ ఆరా ఉండేదికాదు.

అలాగని ఆడపిల్లలంటే భయమా? అంటే అదీ కాదు. అందరితోనూ అవసరమున్నంతమేర మాట్లాడేవాడు. జస్ట్ అంతే!

అలాంటి ఐదంకెల జీతగాడయిన పాతికేళ్ళ బ్యాచిలర్ తొలిసారిగా ప్రేమలో పడ్డాడు.

అయితే, అతను ప్రేమలో పడ్డానికీ కారణముంది... అలాగే ప్రస్తుతం నిద్రలో పీడకలొచ్చినట్టు ఉలిక్కిపడి లేవడానికీ కారణముంది. అంటే కారణంలో కారణమన్న మాట!

* * *

ఆరోజు రీసెర్చ్ సెంటర్‌లో మిగతావాళ్ళతో కలిసి రాత్రి పది దాటినా అక్కడే ఉండి పోయాడు తనీష్.

చాలాకాలంగా జరుగుతున్న పనదే.

బ్యాచిలర్ కాబట్టి ఇంటికెళ్ళి అదే అదే రూమ్‌కెళ్ళి... కాదు కాదు ఫ్లాటుకెళ్ళి చేసేపనులేమీ లేవు కనుక, ఆఫీసు ప్రక్కనున్న క్యాంటీన్‌లో డిన్నర్ కానిచ్చేసీ, నిద్రొచ్చే వేళదాకా కంప్యూటర్ ముందు కాలక్షేపం చేసి, తర్వాత కారులో ఫ్లాటుకెళ్ళి పోవడం అంతే.

మళ్ళీ మర్నాడు ఉదయం పదిన్నరనుండి యథాప్రకారం డ్యూటీ అవర్స్ ప్రారంభం.

ఎప్పటిలా రాత్రి పది దాటినా రీసెర్చ్ సెంటర్ ఆఫీసులోనే ఉండిపోయిన తనీష్, తదితర ఆఫీసు బృందానికి ఆఫీసు ఎండీ సడన్ విజిట్ చేసి, కూర్చోబెట్టి క్లాస్ పీకాడు.

ఆ క్లాస్ కూడా ఏదో సాదా సీదాగా కాదు.

అర్జునుడికి శ్రీకృష్ణుడు మహాభారత సంగ్రామ సమయంలో భగవద్గీత బోధించినంత వివరంగా.

"నేను చాలారోజులుగా, రోజులుగా ఏమిటీ? నెలలుగానే మిమ్మల్ని గమనిస్తున్నాను. ఆఫీసు అవర్స్ అయిపోయినా మీరింకా ఇక్కడే ఉంటున్నారంటే, మిగిలిపోయిన పని పూర్తిచేయడమో, లేదా మీకిచ్చిన పనికంటే అదనంగా ఎక్కువ పనిచేయడమో చేస్తున్నారనుకున్నాను...

కానీ, తర్వాత తెలిసింది. మొదట్లో మీ గురించి నేను అనుకున్నదంతా రాంగని. మీలో చాలా మంది బ్యాచిలర్స్ అయి ఉన్నందున, ఇంటికెళ్ళి చేసే పనుల్లేక ఇక్కడ ఎ.సి.ని, ఇంటర్నెట్‌ని, కాఫీబార్‌ని ఎంజాయ్ చేస్తూ టైమ్ స్పెండ్ చేస్తున్నారు...

మీ ఎంటర్‌టైన్‌మెంటు ఇక్కడ పొందుతున్నందుకు నాకు చాలా వర్రీగా ఉంది. దానికంటే ఎక్కువగా మీరు అసలైన జీవితాన్ని మిస్సవుతున్నందుకు ఆందోళనగా ఉంది...

ఈ కంపెనీలో చాలా అందమైన జీతాన్ని పొందుతున్నారు మీరంతా. దాంతోపాటు పెళ్ళిళ్ళు చేసుకొని అందమైన జీవితాన్ని కూడా పొందండి...

మీ వ్యక్తిగత జీవితం మీద, వ్యక్తిగత అభిప్రాయాల మీద నేను ఇన్‌ఫ్లూయన్స్ చేద్దామని ఇది చెప్పడం లేదు. మనకో మంచి సందేశం పెద్దలిచ్చింది ఉంది.

అదేమిటంటే?...

'వయస్సులో ఉండగానే డబ్బులు సంపాదించాలి. లేదా పిల్లలనైనా కనాలి.' ఇదెందుకన్నారంటే వృద్ధాప్యంలో నువ్వు గతంలో సంపాదించిన డబ్బయినా, లేదా నువ్వుకన్న పిల్లలయినా నీకు అక్కరకొస్తాయని'..." బాస్ చెబుతూ ఆగాడు.

ఈ మాటలు బాస్ తనీష్ వంక చూస్తూ అనడంతో అతనొక్కసారిగా ఆలోచనల్లో పడ్డాడు.

బాస్ ఇలా సడన్‌గా వచ్చి, లెక్చరిస్తూ తమ బుర్రల్ని భోంచేసేస్తున్నాడనుకున్నాడు గానీ, అందులో చాలా చాలా జీవిత సత్యాలున్నాయన్న సంగతి క్రమంగా తెలిసి వస్తుంది అతనికి.

* * *

ఆఫీసవర్స్ అయ్యీఅవ్వగానే ఆఫీసులోంచి బయట కొచ్చేశాడు తనీష్.

బ్యాచిలర్స్ జీవితానికి వీలైనంత తొందరగా స్వస్తి పలికే పనిలో ఆరోజే పడాలని నిర్ణయించుకున్నాడు.

ఈ విషయంలో ఉద్యోగం వచ్చిన నెలనుండే

పేరెంట్స్ పోరుతున్నా ఏమాత్రం పట్టించుకోలేదు తనీష్.

కానీ బాసిచ్చిన ఉపదేశం తర్వాత చాలా ఆవేశం కలిగిందతనిలో.

పిల్లని చూడమని పేరెంట్స్‌కి చెప్పడమా?

లేక, తానే ఆ పనిలో పడి ప్రేమించి పెళ్ళిచేసుకోవడమా?

ప్రే... మ... అనే ఆ పదం మదిలో కదలాడగానే శరీరమంతా ఏదో మత్తు ఆవరించినట్లు, గమ్మత్తుగా తోచింది తనీష్‌కి.

నవలల్లో చదివినప్పుడు, సినిమాల్లో చూసినప్పుడు, ఫ్రెండ్స్ అలాంటి ప్రేమ వ్యవహారాల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు కలగని హాయి ఏదో తొలిసారిగా కలిగిందతనిలో.

కారు డ్రైవ్ చేసుకుంటూ ఆలోచనలతో కదులుతున్న తనీష్ సిగ్నల్ లైట్ పడగానే సడన్‌గా బ్రేక్ నొక్కి ఆగాడు.

కారు టైర్లు కీచుమంటూ శబ్దం చేశాయి.

స్కూటీపెప్‌మీద అలవోకగా కూర్చొని గ్రీన్ సిగ్నల్ ఎప్పుడు పడుతుందాని ఎదురుచూస్తున్న మెరిండా కలర్ చుడీదార్ అమ్మాయి తల తిప్పి వెనక్కి చూసింది.

తన సొంత కారు డ్రైవింగ్ జీవితంలో అలాంటి బ్రేకెప్పుడూ వేసి ఎరుగని తనీష్ గిల్టీగా ఫీలవుతూ ఆమె వంక చూశాడు.

వేర్వేరు భావాలతో, విభిన్నమైన అభినయాలతో ప్రసంగించిన వారిద్దరి చూపులు ఒకేసారి కలుసుకున్నాయి.

''వావ్!'' అరవబోయి తమాయించుకున్నాడు తనీష్.

'యురేకా'ని మనసులోనే అనుకున్నాడు.

సిగ్నల్ తొలగింది. మెరిండా కలర్ చుడీదార్ అమ్మాయి స్కూటీ వెనుక తనీష్ కారు కదిలింది. అప్పుడు చూశాడతను స్కూటీ నేమ్ ప్లేట్ వైపు. ఎ.పి.25 ఎన్. ఒన్... ఫోర్... త్రీ... వుందందులో.

'ఒన్... ఫోర్... త్రీ...' తనీష్ పెదవులపై అందంగా ఓ చిర్నవ్వు మెర్క్యురీ బల్బ్‌లా వెలిగింది.

'ఐ.. లవ్..యూ' స్కూటీ మీదెళ్తూ ఆ సందేశం ఆ అమ్మాయి తనకందించినట్లు ఫీలయ్యాడు తనీష్.

చాలా ఉత్సాహంగా ఫ్లాట్‌కెళ్ళి పోయాడు.

స్నానం చేస్తున్నప్పుడు, డిన్నర్ తింటున్నప్పుడు, నిద్రవేళ దాకా టీ.వీ. చూస్తున్నప్పుడు, నిద్రకు ఉపక్రమించినప్పుడూ మెరిండా కలర్ చుడీదార్ అమ్మాయి వెనక్కి తిరిగి చూసిన చూపు, ఆ రూపం వెంటాడుతూనే ఉన్నాయి.

* * *

''ఐలవ్‌యూ...'' పాత సినిమాల్లో శోభన్‌బాబులా తయారయి రోడ్డుమీద స్కూటీమీదెళ్తున్న అమ్మాయిని కారుమీదొచ్చిన తనీష్ ఆపి, చేతిలో ఎర్ర గులాబి పువ్వుని అందిస్తూ అన్నాడు.

''వ్వాట్'' అరిచినంత పనిచేసింది ఆ అమ్మాయి.

''యస్... నువ్వు లేనిదే నేను లేను. నన్ను ప్రేమించకపోతే నిన్ను నేను బ్రతకనీను. యాసిడ్ పోసి ముఖం కాల్చెయ్యడమో, చాకుతో పీక కోసెయ్యడమో చేస్తాను. ఇంకా... ఇంకా... ఎన్నయినా చేస్తాను. నీ పేరెంట్స్ అడ్డొస్తే వాళ్ళనీ లేపేస్తాను... చెప్పు... ఐలవ్‌యూ...''

పువ్విచ్చేవాడికి ముందు పాత సినిమాల్లో శోభన్‌బాబులా వున్న తనీష్ సడన్‌గా ఇప్పుడు అరుంధతి సినిమాలో విలన్ రాహుల్‌దేవ్‌లా కనిపించాడమ్మాయికి.

'కెవ్'మంటూ కేకేసి కుప్పకూలిపోయింది.

సేమ్ టు సేమ్ అలాంటి కేకలే నాలుగైదేసి, మంచం మీంచి లేచాడు తనీష్.

* * *

ప్రేమిస్తే జ్వరమొస్తుందని మొదట్రోజే తెలుసుకున్నాడు తనీష్. 'ప్రతీరోజూ సమాజంలో జరుగుతున్నవి పేపర్లలో వార్తలుగా, టీవీ న్యూస్ ఛానళ్ళలో సీరియస్ కథనాలుగా వస్తున్నవి చూస్తుంటే తన ప్రేమ సఫలం అవ్వడమనేది బ్రహ్మ ప్రయత్నమే' అనుకున్నాడు.

సిన్సియర్ ప్రేమికుల్ని సైతం అనుమానించే రోజులొచ్చాయి. ఆడపిల్లలు ముఖాలకు యాసిడ్ ప్రూఫ్ బురఖాలు, మెడలకు ఇనుప రేకుల కవచాలు ధరించుకు తిరిగే కాలమొచ్చింది.

మగాడు మృగాడతవుంటే, ప్రేమికుడు కిరాతకుడుగా ప్రవర్తిస్తుంటే ఏ ఆడపిల్ల ఏ మగవాడ్ని నమ్ముతుంది?!

> ప్రేమిస్తే జ్వరమొస్తుందని మొదట్రోజే తెలుసుకున్నాడు తనీష్. 'ప్రతీరోజూ సమాజంలో జరుగుతున్నవి పేపర్లలో వార్తలుగా, టీవీ న్యూస్ ఛానళ్ళలో సీరియస్ కథనాలుగా వస్తున్నవి చూస్తుంటే తన ప్రేమ సఫలం అవ్వడమనేది బ్రహ్మ ప్రయత్నమే' అనుకున్నాడు.

నాలుగైదు రోజులు భయపడి, బెంగపడి, నీరసపడి, చివరికి తనకొచ్చిన సరికొత్తాలోచనతో తేలికపడి, తెరిపిన పడ్డాడు తనీష్!

బండి నెంబర్ ఆధారంగా ఆర్‌టిఏ ఆఫీసు సహకారంతో ఆ అమ్మాయి అడ్రసు, పేరు, ఫోన్ నెంబర్ అన్నీ సంపాదించాడు.

దాన్నిబట్టి పేరు స్వప్నిక, చదువుతోంది ట్రిపుల్ ఇ ఆఖరి సంవత్సరం, ఫోన్ నెంబర్ డబుల్‌నైన్ ఎయిట్ నైన్ ఒన్‌ఫోర్‌త్రీ ఒన్‌ఫోర్‌త్రీ.

పేరునుండి ఫోన్ నెంబర్ వరకూ అన్నీ తెలుసుకున్న తనీష్ పిచ్చెక్కినట్టయిపోయాడు.

పగలాఫీసులో, రాత్రి అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో 'కలవరమాయే గదిలో నా గదిలో' టైపు విరహ, జావళి గీతాలను మనసులోనే మూగగా పాడుకుంటున్నాడు.

* * *

తనకు దొరికిన అడ్రస్సు ఆధారంగా జేమ్సుబాండ్ ట్రిపుల్ సెవెన్ టైపులో స్వప్నిక ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళాడు తనీష్.

ఇల్లు చాలా బాగుంది. ట్రిపుల్ బెడ్ రూమ్ విల్లాస్ టైప్. ఇంటిముందు గేటుకు 'కుక్క ఉన్నది జాగ్రత్త' అనే బోర్డుతోపాటు మరో బోర్డు కూడా కనిపించింది.

మొదటి బోర్డు భయపెట్టలేదు గానీ, రెండో బోర్డు మాత్రం ఆ వీధి చివర అతనాపి వుంచిన కారు వరకూ పరుగెత్తించింది.

పరుగు పరుగున కారు దగ్గరకొచ్చిన తనీష్ ఆగాడు. ఆయాసం తీర్చుకుంటూ ఆలోచించాడు.

'స్వప్నిక ఫాదర్ ఎస్పీ అయితే, తానెందుకు భయపడాలి?' ప్రశ్నించుకున్నాడు.

'తానేమీ తాడూ, బొంగరం లేని వాడు కాదు కదా, మంచి ఉద్యోగం, మంచి జీతం, మంచి రూపం, మంచి కారు... అయినా సోకాల్డ్ ప్రేమికుడిలా నేనేమో ఆమె వెనుక పడ్డంలేదు కదా! నో ప్రాబ్లం...' తనకుతానే సమాధానపడ్డాడు.

* * *

ఇంగ్లీషు అక్షరాలతో తెలుగులో వున్న మెసేజ్ మొబైల్‌కి రావడంతో ఆప్షన్‌కొట్టి మెస్సెజ్ ఓపెన్ చేసింది స్వప్నిక.

''నిన్ను సారీ మిమ్మల్ని ఒకేసారే చూశాను. అప్పటి వరకూ తొలి చూపులో ప్రేమ కలుగుతుంటే నమ్మని వాణ్ణి. ఆ చూపులోనే నమ్మక తప్పని వాణ్ణయ్యాను.

నేను మీ వెనుక పడను.. ప్రేమించమంటూ వేధించను... మీరు కాదంటే మీ ముఖంమీద యాసిడ్ పోయను... మీ గొంతుని చాకుతో కోయను...

మిమ్మల్ని పొందేందుకే పుట్టాననే చెత్తమాటలు చెప్పను.

ఫలానా వాళ్లు దంపతులవుతారని పైన నిర్ణయం జరిగిపోయాకే, ఇక్కడ వివాహాలు జరుగుతాయని మీరూ నమ్మాలి. నచ్చితే మెస్సేజివ్వండి. చిరాకు పెడితే డిలేట్ చేయండి.

మీరే పని చేయడానికైనా ప్లీజ్ లేట్ చేయకండి...''

మొత్తం చదివిన తర్వాత చాలా హాయిగా నవ్వుకుంది స్వప్నిక.

నువ్వు నాకు నచ్చావ్ సినిమాలో భోజనానికి ముందు విక్టరీ వెంకటేష్ చేసిన ప్రార్థనకంటే కొత్తగా అనిపించిందా సందేశం.

పేరు, ఫోన్ నెంబర్ చూసింది.

తనీష్, డబుల్ నైన్ ఎయిట్ నైన్ త్రీ ఫోర్‌టూ, త్రీ ఫోర్‌టూ!

తన మొబైల్ నెంబర్‌కు సమాధానంగా తనీష్ మొబైల్ నెంబర్ ఉన్నట్లనిపించడంతో ఉలిక్కిపడింది.

చివరి ఆరు నెంబర్లు తనవి 'ఐ లవ్‌యు, ఐ లవ్‌యు' అని చెబుతుంటే, అతనివి 'యు లవ్ మి, యు లవ్ మి' అని చెబుతున్నాయి.

ఈ మెస్సెజ్ గురించి పేరెంట్స్‌తో డిస్కస్ చేయాలనుకుంది స్వప్నిక. దానికి ముందు 'మీ మెస్సేజ్ కొత్తగా ఉంది. గుడ్'. రిప్లయ్ మెస్సెజ్ తనీష్‌కిచ్చింది.

* * *

తనీష్, స్వప్నికల వెడ్డింగ్ రెసెప్షన్.

''కంగ్రాట్స్, మిస్టర్ తనీష్. ఆఫీసులోనే కాదు జీవితంలోనూ నెంబర్‌వన్ అనిపించుకుంటావని నాకు తెలుసు. అసలు నువ్వీ అమ్మాయిని సాధించడంలో ఏదో స్కీమ్ ఫాలో అయ్యావట. ఎస్పీగారికది నచ్చే వాళ్ళమ్మాయికి గ్రీన్ సిగ్నలిచ్చారట...

అది సరే కానీ, మొన్నటిదాకా ఆఫీసయ్యి ఆరుగంటలయినా అక్కడే ఉండేవాడివికాస్తా, ఇకపై 'సార్! ఇవ్వాళ అరగంట లేటుగా వస్తానో, గంట ముందెళ్ళిపోతాననే పర్మిషన్లు అడగడం ప్రారంభిస్తావు. కాకపోతే, నువ్వు వాటిని చాలా తక్కువగా అడగాలని కోరుకుంటున్నాను.''

అక్కడ నవ్వులు పూయించి నిష్క్రమించాడు తనీష్ రీసెర్చ్ సెంటర్ ఆఫీస్ బాస్.

★


**రచయిత చిరునామా:**

**నమ్మి కనక నాగేశ్వరరావు,**

టీచర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,

నెగ్గిపూడి- 534122.

వయా మార్టేరు (ప.గో.జిల్లా) ఆం.ప్ర.